క్లుప్తంగా

దత్తాశ్రమంలో పేర్ని దంపతుల పూజలు



కోనేరుసెంటర్: కార్తికమాసాన్ని పురస్కరించుకుని మంగినపూడి దత్త రామేశ్వర పుణ్యక్షేత్రంలో బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), జయసుధ దంపతులు ఆదివారం స్వయంభు లింగాలకు అభిషేకం చేశారు. అనంతరం రుద్ర హోమం, ప్రత్యేక అభిషేకాలను విష్ణుభట్ల సూర్యనారాయణ శర్మ (ఘనాపాటి) పేర్ని దంపతులతో చేయించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ కమిటీ సభ్యులు కురాళ్ల రమేష్‌బాబు, మాటూరి రాంబాబు, సూర్యనారాయణ, విఘ్నేశ్వరరావు తదితరులు ఆలయ మర్యాదలతో పేర్ని దంపతులను సత్కరించారు.

మృతుడి కుటుంబానికి సాయం



నాగాయితిప్ప(మోపిదేవి): నాగాయితిప్ప పీఏసీఎస్ సభ్యుడు చిట్టిమోతు పెద బాబూరావు ఇటీవల మృతిచెందాడు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలను పీఏసీఎస్ చైర్‌పర్సన్ గరికిపాటి గోవిందరాజులు మృతుడి కుమార్తెకు ఆదివారం అందజేశారు. సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు, పుప్పాల సతీష్‌బాబు, పరిశే విజేత, పరిశే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెడన: పెడన–బంటుమిల్లి రోడ్డులో ఆదివారం ఉదయం ఓ వ్యక్తి బండిపై నుంచి కిందపడి పోయి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పెడన ఎస్‌ఐ రవిచంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సదరు వ్యక్తి మద్యం సేవించి వాహనం నడపడంతో అదుపు తప్పి కిందపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. బాధితుడిని 108 వాహనంలో మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కనుల పండువగా మల్లేశ్వరస్వామి కల్యాణం



కొక్కిలిగడ్డ(మోపిదేవి): కొక్కిలిగడ్డలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో కార్తిక మాసం సందర్భంగా ఆదివారం స్వామి వారికి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన జరిగాయి. ఉదయం 11 గంటలకు వేద మంత్రాల మధ్య స్వామివార్లకు కల్యాణం నిర్వహించారు. సాయంత్రం సహస్ర దీపోత్సవం, నీరాజన మంత్ర పుష్పాలతో పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

చిన్నాకు మదర్ థెరిస్సా జాతీయ సేవా రత్న అవార్డు



పెడన: ఆర్యవైశ్య సంఘం పెడన పట్టణ అధ్యక్షుడు, అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ కొల్లూరి సత్యనారాయణ (చిన్నా) మదర్ థెరిస్సా జాతీయ సేవా రత్న అవార్డును అందుకున్నారు. ఇటీవల విశాఖపట్నం జిల్లా పౌర గ్రంథాలయంలో దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ, విశాఖ రత్న కళా పరిషత్ వారు సంయుక్తంగా ఈ అవార్డును అందజేశారు. చిన్నా మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా పెడన పట్టణం, పరిసర ప్రాంత పేదలకు సొంత నిధులతో వివిధ రకాల వ్యాధులకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశామని, తమ సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించిందని చెప్పారు.

దుప్పట్లు, బియ్యం పంపిణీ

చల్లపల్లి: బహుజన మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎస్టీ కాలనీలో 90 నిరుపేద ఎస్టీ కుటుంబాల వారికి దుప్పట్లు, బియ్యం పంపిణీ చేశారు. చిన్నారులకు రొట్టెలు, అల్పాహారం అందజేశారు. మహాసభ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్ సింగ్, రాష్ట్ర రజక సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు, దాసి సీతారామరాజు, కైతేపల్లి దాస్, తూము వెంకటేశ్వరరావు, ఉప్పల సాంబశివరావు పాల్గొన్నారు.

వడివరిగా నూర్పిళ్లు



యండపల్లి వద్ద వరి నూర్పిడికి సిద్ధంచేస్తున్న కూలీలు



యంత్రంతో వరికోత కోయిస్తున్న రైతులు

- ముంపు నుంచి తేరుకుంటున్న వరి పొలాలు
- పనలను ఒడ్డుకు చేర్చుకుంటున్న రైతులు
- పలుచోట్ల ముమ్మరంగా నూర్పిళ్లు
- దెబ్బతిన్న పంటకు ప్రభుత్వం భరోసా

కృత్తివెన్ను: మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పలుచోట్ల వరి పొలాలు నీట మునిగాయి. కోతలు కోసిన పొలాల్లోకి నీరు చేరడంతో పనలు నీటిలో నానాయి. వర్షాలు తగ్గి మామూలు పరిస్థితి నెలకొనడంతో రైతులు పంటల రక్షణలో నిమగ్నమయ్యారు. కోతలు, నూర్పిళ్లు, ధాన్యం ఎగుమతులతో రైతులు బిజీబిజీగా ఉన్నారు. పంట దెబ్బ తిన్న ప్రతి రైతును ఆదుకుంటామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన భరోసా రైతుల్లో ఆనందాన్ని, ధైర్యాన్ని నింపింది.

పంట రక్షణ పనుల్లో బిజీబిజీ

తుపాను నుంచి తేరుకున్న రైతులు పంట రక్షణ పనులు వడివడిగా పూర్తి చేసుకుంటున్నారు. పెడన నియోజకవర్గంలో సుమారు 60,782 ఎకరాల్లో రైతులు ఈ ఏడాది ఖరీఫ్‌ను సాగు చేశారని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు సుమారు 26 వేల ఎకరాలకు పైగా మాసూళ్లు అయినట్లు తెలుస్తోంది. మిగిలిన పంటను సైతం పూర్తి చేసేందుకు రైతులు పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యారు.

అండగా ప్రభుత్వం..

తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటకు ప్రభుత్వం నుంచి పరిహారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పడంతో రైతుల్లో ఆందోళన తొలగిపోయింది. దెబ్బతిన్న ప్రతి ఎకరాకు మాదీ భరోసా అన్న సీఎం మాటలు రైతుల్లో ధైర్యాన్ని నింపాయి. నీట మునిగిన పంటను సైతం ఎటువంటి తేమ శాతం లేకండా కొనుగోలు చేయాలని చెప్పిన మాటలు రైతులకు కొండంత అండగా నిలిచాయి.

సాగు వివరాలు

మండలం	వరి సాగు విస్తీర్ణం (ఎకరాలు)	మాసూళ్లు జరిగినది (ఎకరాలు)
కృత్తివెన్ను	4,782	2,122
బంటుమిల్లి	13,102	5,200
పెడన	23,009	11,400
గూడూరు	20,211	8,204

సీఎం ప్రకటన ధైర్యాన్ని ఇచ్చింది



తుపానుకు ముందు నేను ఐదు ఎకరాలు కోత కోశా. భారీ వర్షాలతో పంటంతా నీటి మునిగింది. తడిసిన వరి మెలకలు సైతం వచ్చేశాయి. ముఖ్యమంత్రి తడిసిన ధాన్యం కొనడంతో పాటు, పంటకు పరిహారం ఇస్తాననడంతో నాకు ధైర్యంగా ఉంది.

–ఎస్. రాంబాబు, కౌలురైతు, యండపల్లి

వేగంగా ధాన్యం కొనుగోళ్లు



కృత్తివెన్ను మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 4,785 ఎకరాల్లో వరిని సాగు చేశారు. ప్రస్తుతం 2,122 ఎకరాల్లో పంటను రైతులు పూర్తి చేశారు. నూర్పిళ్లు చేసిన రైతుల నుంచి వేగంగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. మిగిలిన పంటను కూడా పూర్తి చేసి రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– ఎస్.జెన్నీ, ఏఓ, కృత్తివెన్ను మండలం

ఉత్సాహంగా వనసమారాధనలు



బంటుమిల్లిలో సామూహిక వ్రతాలు



పెడనలో భోజనం వడ్డిస్తున్న జోగి రాజీవ్



గంగానమ్మను దర్శించుకుంటున్న భక్తులు

నాగాయలంక: తలశిల వంశీయుల ఇలవేల్పు గంగానమ్మ తల్లి ఆలయంలో కార్తిక వన భోజనాలు ఆదివారం వైభవంగా జరిగాయి. కమిటీ ప్రతినిధులు ఆలయంలో అమ్మవారికి పూజలు జరిపారు. గంగానమ్మను పట్టు చీర, శంకు పూలు, నిమ్మకాయలతో అలంకరించారు. గ్రామస్తులు, వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ తలశిల వారి ఆడపడుచులు తరలివచ్చి అమ్మవారికి పూజలు జరిపి కార్తిక సమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వెయ్యి మందికి సంప్రదాయ వంటలతో భోజనాలు ఏర్పాటు చేశారు. కమిటీ ప్రముఖులు తలశిల శివరామకృష్ణ, శ్రీనివాస్, ఉప సర్పంచి తలశిల నరసింహారావు, వెంకట నరసింహారావు పర్యవేక్షించారు.

- **పెడన:** మండల పరిధి నందిగామ గ్రామంలోని నాగేంద్రస్వామి పుట్ట వద్ద ఆదివారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. కార్తికమాసం చివరి ఆదివారం కావడంతో స్థానిక ఆలయ కమిటీ నాయకులు వన సమారాధనను ఏర్పాటు చేయడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ భోజనాలు వడ్డించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెడనకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు రాజులపాటి అచ్యుతరావు, ఎండీ ఖాజా, దావు బైరవలింగం, రౌతుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బందరులో న్యాయవాదుల వన సమారాధనలో న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు, న్యాయవాదులు

- **బంటుమిల్లి:** పలు సంఘాల ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధనలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేద గాయత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పాచ్ఛాపురం ఆంజనేయ స్వామి ఆలయంలో వన సమారాధన జరిగింది. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాల్లో పలువురు దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎల్. శశికుమార్, కార్యదర్శి ఎ. కాశీవిశ్వనాథం, బంటుమిల్లి, కృతివెన్ను మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు. అలాగే మండల కాపు సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో బంటుమిల్లి, కృతివెన్ను మండలాల్లోని సంఘ సభ్యులు పాల్గొన్నారు.
- **మచిలీపట్నంటౌన్:** నగరంలోని మార్కెట్‌యార్డు ఆవరణలో యాదవ సంఘం, చిలకలపూడిలో విశ్వబ్రాహ్మణులు, గాంధీ విద్యాలయంలో ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో వనసమారాధనలు జరిగాయి. ఈ కార్యక్రమాలకు వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) హాజరై మాట్లాడారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈడేపల్లి జట్టి వారి తోటలో జరిగిన వన సమారాధనకు జిల్లా మొదటి అదనపు జడ్జి చిన్నంశెట్టి రాజు, పలువురు న్యాయమూర్తులు హాజరయ్యారు. మచిలీపట్నం డివిజన్ మాస్టర్ ప్రింటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన జరిగాయి.

సాగర తీరంలో పర్యాటకుల సందడి



కోడూరు: హంసలదీవి సాగరతీరం పర్యాటకులతో కళకళలాడింది. శని, ఆదివారాలు వరుస సెలవులతో పాటు కార్తికమాసం కూడా కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన యాత్రికులు ప్రత్యేక వాహనాల్లో తీరానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పాలకాయతిప్ప బీచ్ వద్ద పర్యాటకులు పుణ్యస్నానాలు ఆచరించారు. మహిళలు తీరంలోనే సైకత శివలింగాలు సిద్ధం చేసి కార్తిక దీపాలు వెలిగించారు. యువకులు బీచ్ కబడ్డీ, వాలీబాల్ ఆటలతో సందడి చేశారు. సాగర సంగమం వద్ద పరిస్థితులు అనుకూలించకపోవడంతో అక్కడకు పర్యాటకుల రాకపోకలను నిషేధించారు. పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు తీరం వెంట ముమ్మర గస్తీ నిర్వహించారు.

భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలకు స్పందన



మచిలీపట్నంటౌన్: వీహెచ్‌పీ కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బైపాస్‌రోడ్డులోని కృష్ణవేణి ఐటీఐ కళాశాల ప్రాంగణంలో భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఎల్‌కేజీ నుంచి పీజీ విద్యార్థులు 47 మంది పాల్గొని శ్లోకాలను పఠించారు. 18 మంది మహిళలు, 11 మంది పురుషులు భగవద్గీత 10వ అధ్యాయం విభూతి యోగం 42వ శ్లోకాలు పఠించారు. విజేతలకు కళాశాల కరస్పాండెంట్ కొత్తగుండు రమేష్, విశ్వ హిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి అల్లూరి లక్ష్మీకాంతారావు, జిల్లా కోశాధికారి కోట శ్రీకాంత్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. పోటీలకు హాజరైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు భోజన వసతి ఏర్పాటు చేశారు.

స్వామి వార్లకు అన్నాభిషేకం, లక్ష బిల్వార్చన



మచిలీపట్నంటౌన్: కార్తిక మాసం సందర్భంగా ఆదివారం నగరంలోని పలు శైవక్షేత్రాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అన్నాభిషేకం, లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాబర్ట్‌సన్‌పేటలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి అన్నాభిషేకం, లక్ష బిల్వార్చన జరిగాయి. బచ్చుపేట శివాలయంలో స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. రాజుపేటలోని ముత్యంగుడిలో స్వామివారికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. బలరామునిపేటలోని అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిగాయి. అనంతరం హారతులు ఇచ్చారు. ఆలయానికి ఓలేటి చంద్రశేఖర్ నంది విగ్రహాన్ని సమర్పించారు.

అంకమ్మ తల్లికి సారె సమర్పణ

చల్లపల్లి: ఒకటో వార్డులోని జమ్మిలంక అంకమ్మ తల్లికి భక్తులు కార్తిక మాస సారె సమర్పించారు. ఆదివారం స్థానిక సీతారామాలయం నుంచి బయలుదేరి గ్రామంలోని అన్ని దేవాలయాలను సందర్శించారు. ఆయా దేవాలయాల్లో అమ్మవార్లకు సారె సమర్పించి పూజలు చేశారు. గ్రామ దేవత సంపటాలమ్మ తల్లికి సారె సమర్పించారు. అనంతరం భక్తులు జమ్మిలంక అంకమ్మ తల్లి ఆలయానికి చేరుకుని అమ్మవారికి సారె సమర్పించి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



అమ్మవారికి సారె తీసుకెళుతున్న మహిళలు

పవర్ లిఫ్టర్ షబీనాకు సన్మానం



చల్లపల్లి: పవర్ లిఫ్టింగ్ పోటీల్లో అంతర్జాతీయ స్థాయిలో షబీనా రాణించడం గర్వకారణమని నియోజకవర్గ ప్రభుత్వ ఖాజీ మహమ్మద్ మెహబూబ్ పాషా అన్నారు. ఆదివారం స్థానిక అరబ్బీ మదరసా వద్ద ముస్లిం చైతన్య వేదిక నియోజకవర్గ సమావేశం జరిగింది. తెనాలికి చెందిన పవర్ లిఫ్టర్ షబీనాను అవనిగడ్డ శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిషోర్ నాయుడు ఆధ్వర్యంలో సన్మానించారు. చైతన్య వేదిక నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని సత్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మౌలాలీ, అధికార ప్రతినిధి పఠాన్ కరిముల్లా ఖాన్, జిల్లా అధ్యక్షులు అమీరా, నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ నబీఘోరీ పాల్గొన్నారు.

రైతుకు న్యాయం.. ఇదే లక్ష్యం

క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న అధికారులు



పామర్రులో పంట నష్టపోయిన రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మిచాంగ్ తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకునే దిశగా జిల్లా యంత్రాంగం అడుగులు వేస్తోంది. తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా రైతులు పండించిన పంట నీట మునగటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో వ్యవసాయశాఖ అధికారులు వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ప్రాథమిక అంచనాలు రూపొందించగా.. ఈ అంచనాల్లో 1,03,778 హెక్టార్లలో నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. వ్యవసాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు కలెక్టర్ రాజాబాబు ఉత్తర్వులతో క్షేత్రస్థాయిలో ప్రతి రైతు నష్టాన్ని అంచనా వేసేందుకు వ్యవసాయశాఖ అధికారులు సిద్ధమయ్యారు.

34 అంశాలతో..

వ్యవసాయశాఖ విడుదల చేసిన నియమనిబంధనల ప్రకారం 34 అంశాలతో రూపొందించిన ఫార్మాట్ ద్వారా ప్రతి రైతు నుంచి వివరాలు సేకరించనున్నారు. రైతు పేరు, తండ్రి, ఈ–క్రాప్ ఐడీ నంబర్, సర్వే నంబర్, విస్తీర్ణంతో పాటు రైతు బ్యాంక్ ఖాతా నంబర్, ఆధార్ నంబర్‌ను సేకరిస్తారు. 33 శాతం పైబడి నష్టపోయిన రైతుల వివరాలను తెలుసుకుంటారు. ఈ సర్వేలో దిగుబడి ప్రామాణికాన్ని కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు..

క్షేత్రస్థాయిలో వర్షపునీరు తొలగించిన వెంటనే వ్యవసాయశాఖ అధికారులు ఫార్మాట్ ప్రకారం రైతుల నుంచి సేకరించిన వివరాలతో పాటు వారికి రావాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీ వివరాలను కలెక్టర్ ద్వారా వ్యవసాయ శాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపనున్నారు.

అధైర్యం వద్దు.. ఆదుకుంటాం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



లంకతోటలో వరి పనలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

చల్లపల్లి: మిచాంగ్ తుపాన్ బాధిత రైతులు అధైర్యపడవద్దని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతును ఆదుకుంటుందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఆదివారం చల్లపల్లి మండలం పాగోలు పరిధిలో పంట పొలాలను ఎమ్మెల్యే రమేష్ బాబు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు పరిశీలించారు. పాగోలు శివారు లంకతోటలో కౌలు రైతు కుందేటి కోటేశ్వరరావు చేలో మొలకెత్తిన వరి పనలను పరిశీలించారు. తుపాను నేపథ్యంలో రైతులు, కౌలు రైతులు సాగుచేసిన వరి ధాన్యం మొలకెత్తినా, తడిచి రంగుమారినా ప్రభుత్వ మద్దతు ధరకు కొనేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని భరోసా కల్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు సొంత ఇళ్లే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే పేర్ని నాని, కిట్టు
- పాతేరు పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: రాష్ట్రంలో ప్రతి పేదవాడు సొంత గూటిలో నివసించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రంలో అర్హులైన లక్షలాది మంది పేదలకు ఇళ స్థలాలు ఇచ్చారని బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. మండల పరిధిలోని పాతేరు గ్రామంలో అర్హులైన పేదలకు ఆదివారం పేర్ని నాని, కిట్టు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. పేర్ని నాని మాట్లాడుతూ మాట తప్పని, మడమ తిప్పని నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు సొంత గృహాలు నిర్మించుకునేందుకు ప్రభుత్వం తరపున రుణాలు అందజేశారన్నారు. నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ స్థలాలు అందజేస్తామని చెప్పారు. అర్హత ఉండీ స్థలాలు పొందలేని వారు ఇంకా ఎవరైనా ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకువస్తే అటువంటి వారందరికీ న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని కొనియాడారు. కాబట్టే ప్రతి పేదవాడు సొంతింటిలో ఉండాలని ఆశపడుతున్నారని చెప్పారు. ఆయన వంటి ముఖ్యమంత్రి మనకు లభించడం మనమంతా చేసుకున్న అదృష్టమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేసి రుణం తీర్చుకునేందుకు అందరం సిద్ధంగా ఉందామని చెప్పారు. మాజీ జెడ్పీటీసీ, మండల పార్టీ కన్వీనర్ లంకే వెంకటేశ్వరరావు, నియోజకవర్గ కన్వీనర్ శొంఠి ఫరీద్, పాతేరు గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



బందరులో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమం



సెమీ క్రిస్మస్ వేడుకల్లో దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

వెంకటాపురం(మోపిదేవి): వెంకటాపురం సీయోను గాస్పెల్ మినిస్ట్రీస్ ప్రార్థనా మందిరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఎన్‌ఆర్‌ఐ మిన్ని అండ్ జోన్స్ దంపతుల ఆర్థిక సహకారంతో 150 మందికి దుప్పట్లు, హైదరాబాద్‌కు చెందిన అర్పిత, సతీష్ దంపతులు 300 ప్లేట్లు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాది పెనమాక వెంకట్రావు మోపిదేవిలో నూతనంగా నిర్మిస్తున్న ప్రార్థనా మందిరానికి రూ. 10 వేలు సాయం, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు యెహోవా ఈరే ప్రార్థనా మందిరానికి రెండు సీలింగ్ ఫ్యాన్లు అందించామని పాస్టర్ జ్ఞాన సుందరరావు తెలిపారు. ముఖ్యఅతిథి అబ్బూరి విజయరాజు మాట్లాడారు.

- **పురిటిగడ్డ(చల్లపల్లి):** చిన్నారి బాలలు చక్కగా చదువుకోవాలని ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ అన్నారు. ఆదివారం ఐవీఎం కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐవీఎం సహకారంతో చదువుకుంటున్న వంద మంది చిన్నారులకు సురేష్ బహుమతులు అందించారు. సంస్థ ప్రతినిధులు వేములపల్లి విజయ, రోజా, సోఫీ పాల్గొన్నారు.
- **మచిలీపట్నంటౌన్:** మల్కాపట్నంలోని ఎల్‌ఈఎఫ్ చర్చిలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ పాటలు పాడి కేక్ కట్ చేశారు. బ్రదర్ డానియల్ దామోదర్ (చెన్నై) వాక్యోపదేశం చేశారు. క్రీస్తు జననాన్ని జ్ఞాపకం చేసుకుంటూ క్రైస్తవ సమాజం నెల రోజుల పాటు సెమీ క్రిస్మస్ ఆరాధన జరుపుకుంటారన్నారు. ఎల్‌ఈఎఫ్ చర్చి పాస్టర్ తంటిపూడి ప్రభాకరరావు మాట్లాడారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

గుర్రపు డెక్క తొలగింపు

వెంకటాపురం(మోపిదేవి): మండలంలోని వెంకటాపురం నుంచి మెరకనపల్లి పోవు రోడ్డు ముసురుగు డ్రెయిన్‌లో గుర్రపు డెక్కను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆదేశాలతో పొక్లెయిన్ సాయంతో ఆదివారం తొలగించారు. డ్రెయిన్‌లో చేపల కోసం వలలు ఏర్పాటు చేయడాన్ని చూసి ఆ వలలను తొలగించి అడ్డుగా నిలిచిన తూటికాడను డ్రెయినేజీ ఏఈ కట్టా హరీష్ పొక్లెయిన్ సాయంతో తొలగించారు. డ్రెయిన్‌లో మురుగు, పంట పొలాల్లోని వర్షం నీరు మంగళవాని సింక్‌కు వెళ్లడంతో పొలాలు ముంపు నుంచి బయట పడ్డాయని రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సింహాద్రికి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.